క్లుప్తంగా

రోడ్డు పనులు వేగవంతం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్దిపాలెం: రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచించారు. వార్డులో రూ.1.76 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. విద్యానగర్, ఎంఎస్ఆర్ పార్కు ప్రాంతాల్లో రోడ్లు పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ నిధులతో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త కరిమిరెడ్డి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సేన నేత అప్పారావు

కంచరపాలెం: ప్రజలకు స్వేచ్ఛ వాయువులు అందించిన ప్రపంచంలోనే అతిపెద్దదైన భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అభివర్ణించారు. రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నక్కెళ్ల నాగమణి, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, చింతలా మల్లికార్జున రావు, లంకా రామారావు, పట్నాల ఝూన్సీ, సిటీ కన్వీనర్ గొల్లమాల మీనా, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిదులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో వైద్య శిబిరం



పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎం.ప్రశాంత్ మాట్లాడుతూ ఎముకలు బలహీనపడకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ మళ్ల అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఆహారంలో పిండి పదార్థాలు తగ్గించి, ప్రోటీన్ ఎక్కువగా ఉండేవి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. 181 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఉపాధ్యక్షుడు మళ్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్. ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. వన్ టౌన్‌లోని కొబ్బరితోటకు చెందిన బి.కుమార్‌స్వామి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 25న అతడు పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి 26న ఉదయం 5 గంటలకు జ్ఞానాపురం బ్రిడ్జి మీద నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా.. పైడితల్లి అమ్మవారి గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అతడి ఎడమకాలికి గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు కుమార్‌స్వామిని చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు మంచిరోజులొచ్చాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మరింత నాణ్యమైన పౌష్టికాహారంతోపాటు నూతన విద్యా విధానంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చి అద్భుతంగా తీర్చిదిద్దారు. పిల్లల సమగ్రాభివృద్ధికి, జీవితంలో నిలదొక్కుకోడానికి అవసరమైన పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తోంది. ఈ క్రమంలో 3 నుంచి 6 ఏళ్ల వయసు గల చిన్నారులను అన్ని విధాలుగా తీర్చిదిద్ది ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేస్తున్నారు.



ఇది కదా అభివృద్ధి

అంగన్‌వాడీ.. అదిరెను బడి





నక్కవానిపాలెం ప్రీ స్కూల్‌లో పిల్లలకు చదువు చెబుతున్న టీచర్ గౌరి



వినాయకనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తింటున్న చిన్నారులు

సీతమ్మధార: అంగన్‌వాడీ విద్యా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చింది. అంగన్‌వాడీ సెంటర్లను మోడ్రన్ ప్రీ స్కూల్‌గా తీర్చేదిద్దడమే కాకుండా పిల్లలకు ఇచ్చే భోజనం మెనులో అనేక మార్పులు చేసింది. ప్రభుత్వ నిధులతో కొత్త భవనాల నిర్మాణం, పాత వాటికి మరమ్మతులు చేస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందిస్తూ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. పుట్టే బిడ్డ రక్తహీనతతో బాధపడకుండా ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఆకాంక్షతో డ్రై రేషన్ అందిస్తున్నారు.

24వ వార్డులో అంగన్‌వాడీల స్వరూపం

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీవీఎంసీ 24వ వార్డులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నాయి. నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, వినాయకనగర్(తులసీపేట) ప్రాంతాల్లో ఇవి ఉన్నాయి. నక్కవానిపాలెం, వినాయకనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను రూ.3.5 లక్షల చొప్పున నిధులతో అభివృద్ధి చేసి అన్ని సదుపాయాలు కల్పించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసు గల ప్రతి ఒక్క చిన్నారి ఆరోగ్యంగా, బలంగా ఉండేలా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. చిన్నారులకు క్లాస్‌లు, ఆటలు, వారాల పేర్లతో పాటు ఆట బొమ్మల పేర్లు నేర్పిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో పిల్లల భవితకు వరంలా మారిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రేసపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో టీచర్ రాజ్యలక్ష్మి

పిల్లల భోజనం మెనూ

ప్రీ స్కూల్ పిల్లలకు మోడల్ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉడికించిన కోడిగుడ్డు, పాలు(వంద గ్రాములు) ఇస్తున్నారు. సోమవారం: అన్నం, దోసకాయ పప్పు.. మంగళవారం పులిహోర, టమాటో పప్పు.. బుధవారం అన్నం, ఆకుకూర పప్పు.. గురువారం అన్నం, ఆకుకూర, సాంబార్..

శుక్రవారం అన్నం, బీరకాయ లేదా సొరకాయ పప్పు, ములగాకు లేదా పాలకూరతో కూర., శనివారం వెజిటబుల్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబార్ వంటివి పిల్లలకు మధ్యాహ్నం భోజనంగా ప్రభుత్వం అందిస్తోంది.



నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రంగురంగుల బొమ్మలు

● రూ.3.5 లక్షల నిధులతో నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించారు.
● రూ.3.5 లక్షలతో వినాయకనగర్(తులసీపేట) అంగన్‌వాడీ సెంటర్‌ను ఆధునికీకరించారు.



నక్కవానిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార కిట్లు అందుకున్న లబ్ధిదారులు

నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు



రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సరికొత్తగా తీర్చిదిద్దింది. పిల్లల ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చింది. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సమయానికి అందజేస్తున్నారు.

– బి.లక్ష్మీరాజ్యం, బాలింత, నక్కవానిపాలెం

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయం. చిన్నారులకు ఆటపాటలతో చదువు చెబుతున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంతో పాటు గర్భిణులు, బాలింతలకు బలమైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

– రోజా, గర్భిణి, రేసపువానిపాలెం

వార్డు నంబర్ : 24
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు : 3

నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం
- బాలింతల సంఖ్య : 34
- గర్భిణుల సంఖ్య : 26
- ప్రీ స్కూల్ చిన్నారుల సంఖ్య : 15
- 7 నెలల నుంచి మూడేళ్ల పిల్లల సంఖ్య : 157

ప్రీ స్కూల్ టీచర్ : గౌరి

రేసపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం
- బాలింతల సంఖ్య : 24
- గర్భిణుల సంఖ్య : 25
- ప్రీ స్కూల్ చిన్నారుల సంఖ్య : 15
- 7 నెలల నుంచి మూడేళ్ల పిల్లల సంఖ్య : 145

ప్రీ స్కూల్ టీచర్ : రాజ్యలక్ష్మి

వినాయకనగర్(తులసీపేట) అంగన్‌వాడీ కేంద్రం
- బాలింతల సంఖ్య : 15
- గర్భిణుల సంఖ్య : 8
- ప్రీ స్కూల్ చిన్నారుల సంఖ్య : 16
- 7 నెలల నుంచి మూడేళ్ల పిల్లల సంఖ్య : 58

ప్రీ స్కూల్ టీచర్ : సుజాత

బాలింతలు, గర్భిణులకు డ్రై రేషన్

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా రెండు విడతలుగా మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో ఆయిల్, పావు కిలో చెక్కీ, పావు కిలో బెల్లం, పావు కిలో, కర్జూరం , రెండు కిలోల సోడిపిండి, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు అందిస్తున్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా సర్కారు చర్యలు



బాధితులకు చెక్కులు అందజేస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. జోన్–5 పరిధి 51వ వార్డు మాధవధార అంబేడ్కర్‌నగర్ కాలనీ–3లో రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు సోమవారం మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరిస్తోందన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, జోన్–5 ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టారు, డైరెక్టర్ పైడి శ్రీను, సీనియర్ నాయకులు దమయంతి, రాణి, రత్నం, లక్ష్మణ్, శ్రీను, శ్యామ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



యలమంచిలి వారి వీధిలో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు 241 సచివాలయం పరిధి యలమంచిలి వారి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద కేటాయించిన నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. సోమవారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.16.30 లక్షలతో పార్కు నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్ చాకలిపేట వద్ద రూ.16.30 లక్షలతో నూతనంగా పార్కు నిర్మించనున్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ముఖ్య అతిథిగా శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరాజు, ఏఈ నిహారిక, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, బొడ్డేటి కిరణ్‌కుమార్, పాండవ శ్రీను, గండ్రేటి రవిబాబు, నవాబు, బాబ్‌జాన్, ఫరూఖ్, సుశీల, శేషు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన



తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాలు పరిశీలిస్తున్న ఉప కలెక్టర్ అఖిల

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనల మేరకు ఓటర్ల జాబితాను పారదర్శకంగా పరిశీలిస్తున్నామని ఉప కలెక్టర్ అఖిల తెలిపారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆమె సందర్శించి, ఉత్తర నియోజకవర్గ ఓటర్ల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అఖిల మాట్లాడుతూ పీఎస్‌సీ, డీఎస్‌సీ అనే రెండు రకాల డబుల్ ఎంట్రీలు ఉన్నాయన్నారు. రెండు చోట్ల పేర్లు, ఫొటో ఉంటే బీఎల్‌వో ద్వారా పరిశీలించి, ఫారం ద్వారా 15 రోజుల్లో ఆన్‌లైన్‌లో ఒక చోట డిలీట్ చేస్తామన్నారు. ఒక్కో ఇంట్లో ఎంత మంది ఉన్నారని పరిశీలించామని చెప్పారు. ప్రస్తుతం ఉత్తర నియోజకవర్గంలో 2 లక్షల 71 వేల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం పరిశీలించిన తరువాత 2024 జనవరిలో పూర్తి స్థాయి ఓటర్ల జాబితా వస్తుందన్నారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలన్నారు. అర్బన్ తహసీల్దార్ ఎం.ఆనందరావు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

సీతమ్మధార: హైవేపై సత్యం జంక్షన్‌లో బైక్‌ను ఓ కారు ఢీకొట్టిన ఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వెళ్తున్న కారు(ఏపీ39ఎల్ఎన్ 5999) సత్యం జంక్షన్ వద్దకు రాగానే గ్రీన్ సిగ్నల్ పడటంతో ముందుకు కదిలింది. ఆ సమయంలో బైక్ (ఏపీ31 బీవై1839) అడ్డంగా రావడంతో దానిని కారు ఢీకొట్టింది. ద్విచక్ర వాహనదారుడికి చిన్నపాటి గాయాలు కావడంతో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన



బ్రోచర్ అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

మద్రిపాలెం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వ పాలన సాగుతోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా సోమవారం 51వ వార్డు మాధవధార –1 సచివాలయం(1086286) పరిధి వుడా కాలనీలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టారు, డైరెక్టర్లు శ్రీను, దిడ్డి రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు సీనియర్ నాయకులు తిరుమల రావు, అంబటి శైలేష్, దమయంతి, శ్యామ్, రత్నం , వరలక్ష్మి, పి.చంద్రశేఖర్, శ్రీను, గణేష్, సాధు, వినోద్, రాణి, చిన్ని, భాను, కాలనీ పెద్దలు బోగవల్లి గోవింద్, రమేష్, సీహెచ్.శ్రీను, జోన్–5 అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గురుద్వారాలో గురునానక్ జయంత్యుత్సవం



ప్రార్థనల్లో పాల్గొన్న కె.కె.రాజు తదితరులు

సీతమ్మధార: సిక్కు మత స్థాపకుడు, మొదటి గురువు గురునానక్ దేవ్ జీ జయంత్యుత్సవం సందర్భంగా సోమవారం గురుద్వారా మందిరంలో ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు గురుద్వారా అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్ స్వాగతం పలికారు. ప్రతినిధులతో కలిసి మందిరంలో ఆయన ప్రార్థనలు చేశారు. మత పెద్దలు 24 గంటల సంకీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ఐ.హెచ్.ఫారూఖీ, పీలా వెంకటలక్ష్మి, ఆళ్ల శివగణేష్, అమర్ రెడ్డి, కె.సుశీల, పెద్దలు పాల్గొన్నారు.

అఖండ శ్రీరామ నామ సంకీర్తన

మురళీనగర్: సూర్యానగర్ యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం అఖండ శ్రీరామ నామ సంకీర్తన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ సారథ్యంలో జరిగిన సంకీర్తన, హనుమాన్‌చాలీసా మృదు మధురంగా సాగాయి. శ్రీ హరే రామ సంకీర్తన భక్త బృందం కార్యదర్శి సుధా సీతాపతి రావు, గాయకులు సీతాపతిరావు, వెంకట రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, మణి ప్రకాష్, వీరయ్య, పవన్, గాయత్రి పాల్గొన్నారు.

'సరియైన ఉచ్ఛారణ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చార్టర్డ్ అకౌంటెంట్ అంబికా ప్రసాద్ తదితరులు

మురళీనగర్: మనం ప్రతి రోజూ పత్రికలతోపాటు సాధారణంగా వాడే పదాలను కచ్చితత్వంతో పలకాలని చార్టర్డ్ అకౌంటెంట్ అంబికా ప్రసాద్ అన్నారు. మురళీనగర్‌కు చెందిన ఆకాశవాణి పూర్వ న్యూస్ రీడర్ వాకర్ సత్తి లలితారెడ్డి, కేంద్ర ఇంటెలిజెన్స్ పూర్వ ఎస్పీ సత్తి సునీల్‌రెడ్డి సంయుక్తంగా రచించిన 'సరియైన ఉచ్చారణ' అనే పుస్తకాన్ని వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాషలో పదాల ఉచ్చారణ అత్యంత కీలమన్నారు. లలితారెడ్డి, సునీల్‌రెడ్డి దంపతులు 15 ఏళ్లుగా వివిధ మాధ్యమాల్లో ప్రచురిస్తున్న, పలుకుతున్న పదాలపై పరిశోధన చేసి సరైన ఈ పుస్తక రచనకు శ్రీకారం చుట్టారన్నారు. తెలుగు, ఉత్తర భారత దేశ భాషా పదాల ఉచ్చారణల మధ్య వ్యత్యాసాలను లలితారెడ్డి, సునీల్‌రెడ్డి వివరించారు. శరీర అవయవదాన ఉద్యమ నాయకురాలు జి.సీతామహలక్ష్మి మాట్లాడారు.

శంభో శంకర

ఘనంగా కార్తీక మాస పూజలు



పార్వతీశ్వరాలయంలో శివుడికి క్షీరాభిషేకం

సీతంపేట: కార్తీక మాస రెండో సోమవారం సందర్భంగా భక్తుల శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. సీతంపేట పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్ రామలింగేశ్వరాలయం వద్ద భక్తులు బారులు తీరారు. క్షీరాభిషేకాలు, ధ్వజ స్తంభం వద్ద దీపారాధనలు చేశారు.

● లలితానగర్ లలితా పీఠంలో పండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా రాజశ్యామల హోమం నిర్వహించారు.

ఉమా నీలకంఠేశ్వరుడికి అభిషేకాలు

సీతమ్మధార: 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి దంపతులు సాదర స్వాగతం పలికారు.

● నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయానికి భక్తులు పోటెత్తారు. రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.

● గణేష్‌నగర్ శివపార్వతి సమేత త్రిముఖ విఘ్నేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్‌బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, ఉమానీలకంఠేశ్వరాలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ప్రవీణ్‌వర్మ, రాధ, జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న కె.కె రాజు

కంచరపాలెం శైవక్షేత్రాలు కళకళ

కంచరపాలెం: కంచరపాలెం, గొల్లకంచరపాలెం, 104 ఏరియా బాపూజీనగర్, ధర్మానగర్, ఇందిరానగర్, రెడ్డి కంచరపాలెంలో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

జ్వాలాతోరణ ఉత్సవం

55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లోని పార్వతీ సిద్ధేశ్వరాలయంలో జ్వాలాతోరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు స్వామిని దర్శించుకుని జ్వాలాతోరణాన్ని వెలిగించారు.

శివలింగానికి భస్మాభిషేకం

మద్రిపాలెం: గాంధీనగర్–2లోని పార్వతీ సమేత అమృత లింగేశ్వరస్వామి స్పటిక లింగ శివాలయంలో శివలింగానికి అర్చకులు జయంతి సూర్యశర్మ ఆధ్వర్యంలో భస్మాభిషేకం నిర్వహించారు.

'గ్రీవెన్స్'కు అర్జీలు

సీతమ్మధార: బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కొన్నింటిని కె.కె.రాజు వెంటనే పరిష్కరించారు. మరి కొన్ని వినతులను అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.